ప్రజాశక్తి

సోమవారం 18 ఆగస్టు 2025 5 శ్రీ సత్యసాయి

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

మహిళలపై అఘాయిత్యాలకు అడ్డుకట్ట లేదా..?

జిల్లాలో మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలకు అడ్డుకట్ట వేసేవారే లేకుండాపోయారు. దీంతో మహిళలపై జరుగుతున్న నేరాలు నిత్యం వెలుగుచూస్తు ఉన్నాయి. ఒంటరి మహిళ పట్ల సహాయం పేరుతో వేధిస్తున్న ఘటనలు, పొలాలు, గట్ల వద్ద దళిత, గిరిజన మహిళలకు ఎదురైన వేధింపులు, పోలీసుల నుంచి బూతుపురాణాలు ఇవన్నీ ప్రభుత్వ నిర్లక్ష్యానికి అద్దం పడుతున్నాయనడంలో ఎలాంటి సందేహం లేదు. వేదికలపై మహిళల పట్ల నీతిమాటలు చెప్పే నాయకులే లోలోన కేసుల విషయంలో బెదిరించడం, వాటిని నీరుగార్చేలా పోలీసులపై ఒత్తిడి తీసుకురావడం లాంటి సంఘటనలు తీవ్ర విమర్శలకు దారితీస్తున్నాయి. ఇలాంటి సంఘటనలతో రాజకీయ నాయకులు, పోలీసుల్లో ఎలాంటి భావనలు ఉన్నాయో కానీ... ఆయా బాధిత మహిళలు, కుటుంబాలు మాత్రం నరకయాతన అనుభవిస్తున్నాయి. ఇవన్నీ ప్రత్యక్షంగా కనిపిస్తున్నా పోలీస్ శాఖ ఉన్నతాధికారులు కఠినంగా వ్యవహరించకపోవడంతో మహిళల పై అఘాయిత్యాలకు పాల్పడే వారికి కనీస భయం కూడా లేకుండా పోతోంది. ఇందులో భాగస్వాములవుతున్న రాజకీయ నాయకులు, పోలీసులు ఆయా శాఖలకు మాయని మచ్చ తెస్తున్నాయనడంలో సందేహంలేదు.

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

రాప్తాడు నియోజకవర్గ పరిధిలోని 15ఏళ్ల అమ్మాయికి జరిగిన దుర్ఘటన, జిల్లా కేంద్రంలోని రామకృష్ణకాలనీలో చిన్మయిని ఘోరంగా చంపిన సంఘటన మరువకముందే కళ్యాణదుర్గం నియోజకవర్గంలో మహిళల పట్ల చోటు చేసుకున్న నేరాలు, ఘోరాలు వెలుగు చూస్తున్నాయి. పట్టణానికి చెందిన నిండు గర్భిణి శ్రావణి అత్తింటివారి వేధింపులు తాళలేక, రాజకీయ నాయకుల ఏకపక్ష మద్దతు, పోలీసులు నిర్లక్ష్యం కారణంగా ఆత్మహత్య చేసుకున్న సంఘటన చోటు చేసుకుంది. ఇందుకుగల కారణాలు వాయిస్ రికార్డులలో నమోదు చేయడం కలకలం రేపింది.

మహిళలపై అఘాయిత్యాలు పరిశీలిస్తే ....

ఈనెల 14వ తేదీ రాత్రి అంటే మరో 5గంటలు గడిస్తే దేశంకోసం అందరూ స్వాతంత్ర్య వేడుకలు జరుపుకునే సమయం. అలాంటి రోజు పట్టణానికి చెందిన గర్భిణి శ్రావణి ఆత్మహత్యకు పాల్పడింది. భర్త శ్రీనివాసులు, అత్త కరెమ్మ, మామ శివప్ప చేసిన హింసలు వేధింపులకు గర్భంలో వున్న బిడ్డతో సహా ఈలోకాన్ని వదిలివెళ్లింది. ఇందుకు గల కారణాలను వాయిస్ మెసేజ్‌లో రికార్డు చేసింది. అయినా ఈ కేసును నీరుగార్చేందుకు పోలీసులు, పలువురు రాజకీయ నాయకులు విశ్వయత్నాలు చేశారు. ఆరునెలల క్రితం కళ్యాణదుర్గం మండలం మల్లికార్జునపల్లికి చెందిన శాంతికుమార్‌ను నిత్యం పోలీసులు స్టేషన్‌కు పిలిపించి వేధిస్తుంటే ఆ అవమానాన్ని భరించలేని భార్య గొల్ల మమత, తన బిడ్డ చిన్నారిని నీటితొట్టెలో ముంచి చనిపోయాక తాను సైతం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. బ్రహ్మసముద్రం మండల కేంద్రంలో ఒంటరి మహిళను టీడీపీ కార్యకర్త సహాయం పేరుతో డబ్బులు కావాలని, చెప్పినట్లు వింటే నీకు అన్ని పనులు జరిగిపోతాయంటూ వేధించిన సంఘటన వెలుగుచూసినా అక్కడి పోలీసులు అంతంతమాత్రంగానే పరిగణలోకి తీసుకున్నారు. అదే బ్రహ్మసముద్రం మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన దళిత మహిళ వేరుశెనగ పొలాన్ని, అదే గ్రామంలో బీసీ వర్గానికి చెందిన వ్యక్తి పశువులు మేసి ధ్వంసం చేశాయి. ఈవిషయంలో సదరు మహిళ నిలదీస్తే టీడీపీ కార్యకర్త నానా దుర్భాషలాడారు. పోలీస్‌స్టేషన్‌ను ఆశ్రయించగా తప్పుడు కేసులు బనాయిస్తున్నారంటూ ఎస్ఐ నారేంద్రకుమార్ బెదిరింపులకు దిగారు. ఆమెకు సహాయంగా వెళ్లిన మరొకరిపై చిందులు వేస్తూ దబాయించారు. అదే మండలంలోని మరో గ్రామంలో ఎస్టీ వర్గానికి చెందిన వ్యక్తి పొలం గట్టువిషయమై తగాదా పడగా ఈవిషయంలో అతని వ్యతిరేక వర్గీయులు కులంపేరుతో దుషించి తలపై దాడిచేశారు. అడ్డుకోబోయిన ఆయన భార్యను నానాదుర్భాషలాడారు. కేసు విషయంలో నాన్చుడు ధోరణి ప్రదర్శించగా భార్య,భర్త స్టేషన్ ఎదుట బైటాయించి నిరసన తెలిపారు. మహిళపేరుతో ఫిర్యాదు

- ◆ రాజకీయ ఒత్తిళ్లతో పోలీస్‌శాఖ నిర్లక్ష్య ధోరణి
- ◆ వేధింపులు, హింసలు, అవమానాలతో నరకయాతన
- ◆ గర్భిణి శ్రావణి ఆత్మహత్య సంఘటనతో జిల్లాలో కలకలం
- ◆ ఏడుగుర్రాలపల్లి, చిన్మయి సంఘటనలు మరువకనే మరిన్ని...
- ◆ బెదిరింపులు, రాజకీయ ఒత్తిళ్లతో నీరుగారుతున్న కేసులు

వద్దని భర్తపేరుతో ఫిర్యాదు తీసుకుని కేసును తుస్సుమనిపించారు. కుందుర్పి మండలంలోని ఓ గ్రామంలో ఎన్టీఆర్ బర్త్‌డే సందర్భంగా ఎన్టీఆర్ అక్షరాలకు నల్లకాటన్ ఏర్పాటు చేసి పెట్రోల్‌తో వాటిని ఒకడు ఎన్ అక్షరం వద్ద అంటించగా పెట్రోల్ పోస్తున్నవాడు చివరిలో ఆర్ అక్షరం వద్దకు మంటలు వ్యాపించగా చేతిలోవున్న పెట్రోల్ బాటిల్‌ను విసిరి వేశాడు. సమీపంలో ఉన్న ఓ చిన్నారిపై పెట్రోల్ బాటిల్ పడి మంటలకు గాయాలయ్యాయి. ఈసంఘటనను కూడా తొక్కిపెట్టారు. అదేమండలంలోని జంబుగుంపల గ్రామంలో మూడేళ్ల బాలికపై అత్యాచార సంఘటన జరగగా బాధ్యుడిపై ఫోక్సోకేసు నమోదు చేశారు. కళ్యాణదుర్గం మండలం నారాయణపురం గ్రామానికి చెందిన ఓ గర్భిణి మొహరం పండుగ కోసం తన పుట్టినిల్లు అయిన శెట్టూరు మండలం చిన్నంపల్లికి వెళ్లింది. అంతకుముందు వారం రోజుల క్రితమే అక్కడ పుట్టిన వారు ,పక్కింటి వారు చిన్న గొడవపడ్డారు., ఈ విషయంలో శెట్టూరు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేసుకున్నారు. కాగా పుట్టిన వారు పక్కింటి వారితో గొడవ పడిన సమయంలో పుట్టింటిలో లేని గర్భిణిపై కౌంటర్ కేసు నమోదు చేయడానికి ఆ మండల ఎస్ఐ ఒత్తిడి చేసిన సంఘటన వివాదానికి దారి తీసింది. ఇవి వెలుగులోకి వచ్చిన సంఘటనలు కొన్ని మాత్రమే. లోలోన నాయకుల బెదిరింపులు, పోలీసులు నాన్చుడుతో ఎన్నెన్నే నీరుగారిపోయాయని బాధిత కుటుంబాలు వాపోతున్నాయి.

మహిళలకు న్యాయంచేస్తారనే నమ్మకం లేదు

ప్రస్తుత ప్రభుత్వంలో మహిళలపట్ల జరుగుతున్న నేరాలు, ఘోరాలను రాజకీయనాయకులు, పోలీసులు అధికార దర్పంతో అణిచిపెడుతున్నారు. బాధితులకు న్యాయం జరుగుతుందనే నమ్మకం లేకుండాపోయింది. బాధిత మహిళలు ధైర్యంగా సమస్యను చెప్పుకోలేని స్థితికి తీసుకు వస్తున్నారు. నేరంచేసేవాడు రాజకీయ నాయకుని పంచన వుంటాడు. ఫిర్యాదు చేసినా పోలీసులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. పైగా రాజకీయ నాయకులకు సమాచారమిచ్చి ఇళ్లకు వెళ్లి బెదిరించేలా పురిగొలుపుతున్నారు. నిజాలు తెలుస్తాయి కాని న్యాయం మాత్రం జరగదు. ఇందులో ప్రభుత్వ నిర్లక్ష్యం స్పష్టంగా వుంది. పోలీసులు మహిళలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టలేకపోతుంటే ఇక న్యాయం కోసం ఎక్కడికి వెళ్లాలి. ఇలాంటి వాటిపై మహిళలు, ప్రజాసంఘాలు స్పందించి ఘోరాలకు పాల్పడేవారిని శిక్షించేదాక పోరాడాలి.

చంద్రిక,
ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి

ఉగ్ర కార్యకలాపాలను గుర్తించేందుకు ప్రత్యేక బృందం : ఎస్పీ

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి జిల్లాలో ఉగ్రవాదుల భావజాలమున్న అనుమానితులను, వారితో సంబంధాలను కొనసాగించే వారిని గుర్తించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయనున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా ఎస్పీ వి. రత్న పేర్కొన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడారు. ధర్మవరం పట్టణంలో చికెన్ అంగడి నడుపుతున్న నూర్ మహమ్మద్ లోనికోట గ్రామంలో నివాసం ఉంటూ పట్టణంలో మసీదులు, ప్రార్థన మందిరాల వద్ద యువతను ఉగ్రవాదం వైపు ప్రేరేపించడానికి తనదైన శైలిలో నిషేధిత జాబితాలో ఉన్న జైసే మహమ్మద్ , ఇతర గ్రూపులతో సంబంధాలను కొనసాగించేవాడని దీంతో నూరు మహమ్మద్ ను శనివారం అదుపులోకి తీసుకుని రిమాండ్ తరలించామని చెప్పారు. నూర్ మొహమ్మద్ పాకిస్తాన్‌లో నిషేధించిన ఉగ్రవాద సంస్థల ఆధ్వర్యంలో నడుస్తున్న ఆరు వాట్సప్ గ్రూపులతో సంబంధాలు కొనసాగించినట్లు తెలిసిందన్నారు. ఈ గ్రూపులలో ఉగ్రవాద భావాజాలం, దేశ వ్యతిరేక ప్రచారం, జిహాది ప్రేరణ జరుగుతున్నట్లు వెలుడైనట్లు తెలియడంతో అతని మొబైల్ ఫోను, సిమ్ కార్డు, ఒక పుస్తకాన్ని స్వాధీనం చేసుకొని విచారణ చేపడుతున్నట్లు తెలిపారు. ఉగ్రవాదులతో అతని పాత్ర, ఎవరెవరుతో సంబంధాలు కొనసాగించారు, అతడిని గ్రూపులో ఎవరు చేర్చార,. ఎన్ని ఉగ్రవాద సంస్థలతో సంబంధాలు కొనసాగిస్తున్నారని అంశాలపైన రాష్ట్ర కౌంటర్ ఇంటెలిజెన్స్ సెల్ వారు సమాచారం ఇస్తారని చెప్పారు. వారి సమాచారం మేరకు తదుపరి చర్యలు ఉంటాయని వివరించారు. జిల్లా వ్యాప్తంగా కదిరి ,హిందూపురం ,పుట్టపర్తి, ధర్మవరం ప్రధాన పట్టణాల్లో ఇలా దేశ వ్యతిరేక కార్యక్రమాలు చేపట్టే వ్యక్తులపై ప్రత్యేక నిఘా ఉంచి, అలాంటి వ్యక్తులను గుర్తించడానికి ఆయా పట్టణాల్లో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తామని అందుకోసం జిల్లాలో ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ విలేకరులు సమావేశంలో డీఎస్పీ నర్సింగప్ప, ధర్మవరం పట్టణ సిఐ రెడ్డప్ప తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతతను చెడగొట్టే కుట్రలను సహించం:మంత్రి

ధర్మవరం రూరల్ : ధర్మవరంలో ప్రశాంతతను చెడగొట్టే కుట్రలను సహించమని రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మరియు వైద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ స్పందించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ధర్మవరం శాంతియుత పట్టణం అని అన్నారు.ప్రజలు ప్రశాంతంగా ఉండాలని, అలజడులకు తావివ్వకూడదని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై మరిన్ని వివరాలు అధికారిక నిఘా సంస్థల నివేదికల ద్వారా త్వరలో వెలుగులోకి వస్తాయని అప్పటి వరకు ఊహాగానాలకు లొంగకుండా, సహనంతో ఉండాలని కోరారు.

వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతి

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్, నల్లచెరువు, కొత్తచెరువు, ముదిగుబ్బ

కొత్తచెరువు, నల్లచెరువు మండలాల్లో ఆదివారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో ముగ్గురు మృతిచెందారు. కొత్త చెరువు మండలం మైలేపల్లి గ్రామం వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ధర్మవరం పట్టణం బోయ వీధికి చెందిన మంజునాథ్,(25), కొత్తచెరువు మండలం వేములేటి పల్లి గ్రామానికి చెందిన నాగరాజు (55) మృతిచెందారు. మృతుడు మంజునాథ్ ధర్మవరంలో కుంకుమ వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. మరో మృతుడు నాగరాజు వ్యవసాయం చేసుకుంటూ కుటుంబాన్ని పోషించేవాడు. ఇతనికి భార్య, ఒక కుమారుడు, ఒక కుమార్తె ఉన్నారు. వేర్వేరు ద్విచక్రవాహనాల్లో వస్తున్న వీరు ఎదురెదురుగా ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. అదే విదంగా నల్లచెరువు మండలం పాత స్టేషన్ సమీపంలో ఆదివారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో పూలకుంట గ్రామానికి చెందిన షాకీర్(40) మృతిచెందాడు. ద్విచక్రవాహనంలో కదిరికి వెళుతున్న షాకీర్‌ను పాతస్టేషన్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన షాకీర్‌ను కదిరి ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. అదే విధంగా ముదిగుబ్బ మండలం దొరిగల్లు పులివెందుల ఘాట్ రోడ్డు లో కారు, టాటా ఎస్, ద్విచక్ర వాహనం ఢీకొన్న ఈ ప్రమాదంలో పలువురు గాయపడ్డారు. ఈ ఘటనకు సంబంధించి వివరాలు తెలియాల్సుంది. ఈ ప్రమాదాలపై ఆయా మండలాల పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో అన్నదానం

ప్రజాశక్తి - హిందూపురం

పట్టణంలోని జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు, రోగుల బంధువులకు, ఆసుపత్రి పారిశుధ్య, భద్రత సిబ్బందికి 6వ వార్డు క్లస్టర్ ఇంచార్జ్ ఎం డి ఎస్ ఇందాద్, 7వ వార్డు ఇంచార్జ్ మహబూబ్ బాషా ఆధ్వర్యంలో ఆదివారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిఎన్ఎస్ఎఫ్ జిల్లా అధికార ప్రతినిధి ఎం.డీ. ఎస్. అమన్, బండ్లపల్లి హసీబ్, అక్బర్, ఐటిడిపి సాదిక్, యాసిన్, షామీర్, రెహ్మాన్, సుహేబ్, ఉజేఫా తదితరులు పాల్గొన్నారు.

అపరిశుభ్రతతోనే ఫీవర్ కేసులు నమోదు

ప్రజాశక్తి - హిందూపురం

హిందూపురం రూరల్ మండలం నందమూరి నగర్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అపరిశుభ్రత వలనే విద్యార్థులకు వైరల్ ఫీవర్ కేసులు ఎక్కువ నమోదు అయినట్లు డిసిఒ డాక్టర్ జయలక్ష్మి పేర్కొన్నారు. ఈసందర్భంగా ఆమె గురుకుల పాఠశాలను ఆదివారం సందర్శించారు. ఇటీవల గురుకుల పాఠశాలలో విద్యార్థులకు ఇన్ఫెక్షన్ ఎక్కువయి కొంతమంది విద్యార్థులు జ్వరాల బారిగా పడటంతో పాటు వాంతులు, విరేచనాలతో ప్రభుత్వ ఆసుపత్రిలో చేరారన్నారు. వెంటనే వైద్య ఆరోగ్య సిబ్బంది ఆధ్వర్యంలో ఆసుపత్రిలో ప్రత్యేక వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు మెరుగైన వైద్య సేవలను అందించామన్నారు. నీటి సరఫరాలో లీకేజీల వల్ల విద్యార్థులకు ఇన్ఫెక్షన్ సోకినట్లు నిర్ధారించి, వెంటనే లీకేజీలను మరమ్మత్తులు చేయించామన్నారు. బసవన్నపల్లి ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి జయంత్ నాయక్ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేసి విద్యార్థులకు వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

స్త్రీశక్తి పథకంతో

జీవనోపాధి కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకోవాలి

ఆటో కార్మికులతో సిఐటియు నాయకులు

ప్రజాశక్తి - గోరంట్ల

కూటమి ప్రభుత్వం మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో జీవనోపాధిని కోల్పోతున్న ఆటో కార్మికులను ఆదుకుని న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ యస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద జరిగిన సమావేశంలో ఈఎస్ వెంకటేష్ మాట్లాడుతూ స్త్రీశక్తి పథకం వలన రాష్ట్రవ్యాప్తంగా లక్షలాది మహిళా ప్రయాణికులకు ప్రయోజనం చేకూరడం హర్షనీయమన్నారు. అయితే మారుమూల ప్రాంతాల్లో ఆటోలే జీవనోపాధిగా ఉన్న నిరుద్యోగులు ఇబ్బందులు పడే పరిస్థితి వస్తుందన్నారు. ఈ నేపథ్యంలో వారిని ప్రభుత్వం ఆదుకోవాలన్నారు. ఆటో కార్మికులకు ప్రత్యేక ఆర్థిక సాయాన్ని ప్రకటించాలని, రుణ సబ్సిడీ, ఇంధన సబ్సిడీ ప్రకటించాలన్నారు. వాహన బీమా అమలు చేయాలన్నారు. 5లక్షల వరకు వడ్డీలేని రుణాలివ్వాలని, లైసెన్స్ ఉన్న ప్రతి ఆటో డ్రైవర్‌కు సంవత్సరానికి ఏటా రూ. 25వేలు జీవనభృతి కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఆటో కార్మికుల పట్ల స్పందించకుంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొండ వెంకటేష్, సిఐటియు మండల కన్వీనర్ నాగరాజు, మహమ్మద్ మహబూబ్ బాషా, ఆటో కార్మిక సంఘం నాయకులు షేక్ నూర్ భాషా, శంకర, సోమశేఖర్, బిస్కెట్ బాబా, కరీం, మహబూబ్ బాషా, ముస్తఫా, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అస్తవ్యస్తంగా సచివాలయ వ్యవస్థ

ప్రజాశక్తి-హిందూపురం

పట్టించుకోని అధికారులు
ఫీల్డ్ విజిట్ పేరుతో విధులకు కార్యదర్శులు డుమ్మా
సచివాలయాలు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్న ప్రజలు

గత ప్రభుత్వం తీసుకొచ్చిన సచివాలయ వ్యవస్థ ప్రస్తుతం అస్తవ్యస్తంగా మారింది. ఉన్నతాధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో సమయానికి కార్యదర్శులు సచివాలయానికి రావడం, సంతకం పెట్టడం, ఫీల్డ్ విజిట్ పేరుతో వెళ్లిపోవడం చకచకా జరిగిపోతున్నాయి. సచివాలయంలో కార్యదర్శులు అందుబాటులో లేక వివిధ పనుల కోసం వచ్చిన ప్రజలు సచివాలయాల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సిన దుస్థితి ఉంది.

హిందూపురం పురపాలక సంఘంలో 38 వార్డులు ఉన్నప్పటికీ పరిపాలన రీత్యా 43 సచివాలయాలను ఏర్పాటు చేశారు. ఒక సచివాలయానికి పదిమంది కార్యదర్శుల చొప్పున 430 మంది వివిధ విభాగాల కార్యదర్శులు ఉండాల్సి ఉంది. గత ప్రభుత్వ సమయంలోనే హిందూపురం పురపాలక సంఘంలో కార్యదర్శుల కొరత ఉండేది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలో వచ్చిన అనంతరం సచివాలయ వ్యవస్థలో సమూల మార్పులను తీసుకువచ్చింది. వివిధ విభాగాల కార్యదర్శుల పోస్టులకు ఎసరు పెట్టింది. వార్డ్ అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీ పోస్టులు 43 ఉంటే దీనిని 37కు కుదించింది. అమ్యూనిటీ సెక్రటరీలు 28, ప్లానింగ్ సెక్రటరీలు 22, వెల్ఫేర్ సెక్రటరీలు 41 కి రీషలైజేషన్ తో కుదించారు. ఇలా సెక్రటరీల పోస్టులు తగ్గిపోయాయి. రీషలైజేషన్ అనంతరం పూర్తిస్థాయిలో సెక్రటరీలు ఉన్నారా అంటే వారు సైతం లేరు. అడ్మినిస్ట్రేటివ్ సెక్రటరీలు 37 మందికి గాను 30 మంది మాత్రమే ఉన్నారు. ఎడ్యుకేషన్ డాటా ప్రాసెసింగ్ సెక్రటరీలు 43 మంది ఉండాల్సిన చోట 27 మంది మాత్రమే ఉన్నారు. అమ్యూనిటీ సెక్రటరీలు 28 మంది ఉండాల్సి ఉంటే 26 మంది ఉన్నారు మరో ఇద్దరు విధులకు రావడం లేదు. శానిటేషన్ సెక్రటరీలు 43 మంది ఉండాల్సిన చోట 29 మంది ఉన్నారు 14 సెక్రెటరీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అన్ని విభాగాల కార్యదర్శులను పరిశీలన చేస్తే 50 మంది సిబ్బంది కొరత ఉంది. సచివాలయంలోని కీలకమైన డాటా ప్రాసెసింగ్, శానిటేషన్ కార్యదర్శులు లేరు. డేటా ప్రాసెసింగ్ కార్యదర్శి కి ఎక్కువ పని ఉంటుంది. దానికి అదనంగా మున్సిపల్ పాఠశాలలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించి ఆన్ లైన్ చేయాలి. సచివాలయాల్లో 10 శాఖలు ఉంటే అందులో ఆరు శాఖలను మునిసిపల్ శాఖకు అనుబంధంగా మరో నాలుగు శాఖలను ఆయా మాతృ శాఖల పరిధిలో ఉంచారు. మున్సిపాలిటీ కేటాయించిన ఆరు శాఖలకు గతంలో 258 మంది సిబ్బందిని కేటాయించారు. పోస్టుల క్రమబద్ధీకరణ అనంతరం ఈసంఖ్య 214 కు చేరింది. బదిలీల్లో ఇక్కడ నుంచి 45 మంది వెళ్లగా 25 మంది మాత్రమే వచ్చారు. ఇలా క్రమబద్ధీకరణ, బదిలీలతో సచివాలయాల్లో సెక్రెటరీల కొరత ఏర్పడింది. కనీసం ఉన్న సిబ్బంది అయినా ప్రజలకు అందుబాటులో ఉండి విధులు నిర్వహిస్తున్నారా అంటే అదీ లేదు. ఉన్నతాధికారుల పరివేక్షణ పూర్తి స్థాయిలో లేకపోవడంతో సచివాలయాల్లో సెక్రటరీలు 'ఆడింది ఆట.. పాడింది పాట'గా మారిపోయింది. ఉదయం 10 గంటలకు సచివాలయాలకు రావడం హాజరులో సంతకం పెట్టి ఫీల్డ్ విజిట్ పేరుతో వెళ్ళిపోవడం నిత్యకృత్యమైంది. సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న కార్యదర్శులు ప్రస్తుతం సర్వేలు మాత్రమే నిర్వహిస్తున్నారు. నెలలో రెండు రోజులు మాత్రం సామాజిక పింఛన్ల పంపిణీ చేస్తున్నారు. పింఛన్ల పంపిణీ కోసం వార్డుల్లోకి వచ్చే కార్యదర్శులు ద్విచక్ర వాహనాన్ని సైతం దిగకుండానే పింఛను పంపిణీ చేసి వెళ్లిపోతున్నారు. దీన్ని బట్టి చూస్తే వారు తమ విధుల్లో ఎంత నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతుంది. ఇప్పటికైనా ఉన్నతాధికారులు సచివాలయాల పైన ప్రత్యేక దృష్టి సారించి, అందుబాటులో లేని వార్డ్ కార్యదర్శులపై క్రమశిక్షణ చర్యలు తీసుకొని, సచివాలయ వ్యవస్థను గాడిలో పెట్టాల్సిన అవసరం ఉంది.

పళని నగర్‌లోని సచివాలయంలో ఇద్దరు మాత్రమే ఉన్నా దృశ్యం (ఫైల్‌ఫొటో)

ద్విచక్ర వాహనంపై నుంచే సామాజిక పింఛను అందిస్తున్న మహిళా పోలీస్(ఫైల్‌ఫొటో)

సూక్ష్మ సేద్యం రైతులకు ఉపయోగం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి. సుదర్శన్

సూక్ష్మ సేద్యం ద్వారా రైతులకు ఎంతో మేలు చేకూరుతుందని, బోరు బావుల కింద తక్కువ నీరు, విద్యుత్‌తో ఎక్కువ పంటను సాగు చేసి లాభాలను గడించవచ్చునని శ్రీ సత్యసాయి జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి సుదర్శన్ తెలిపారు. ఈ మేరకు ఆయన ఆదివారం ప్రజాశక్తికి ఇచ్చిన ప్రత్యేక ఇంటర్వ్యూలో పలు విషయాలను వెల్లడించారు.

ప్రశ్న : బిందు సేద్యం ద్వారా రైతులకు ఎలాంటి లాభాలు ఉన్నాయి ?

జవాబు: డ్రిప్ సిస్టం అనేది మొక్కలకు నీటి సరఫరా చేయడానికి ఉపయోగించే ఒక రకమైన నీటిపారుదల వ్యవస్థ. దీనినే బిందు సేద్యమంటారు. డ్రిప్పు వలన నీరు ఆదా అవ్వడమే కాక పంట విస్తీర్ణం పెరుగుతుంది. ఒక ఎకరా పొలానికి మోటర్ ద్వారా కట్టే నీరు మూడెకరాల పొలానికి డ్రిప్పు ద్వారా అందజేయవచ్చు. దిగుబడి సైతం పెరుగుతుంది. విద్యుత్ ఆదా అవుతుంది. పంటలో కలుపు రాకుండా ఉంటుంది. ఎరువులు వేయడానికి సులభతరంగా ఉంటుంది. వేసిన ఎరువులు వధా కాకుండా మొక్కలకు మాత్రమే అందుతాయి.

ప్ర : రైతులకు సబ్సిడీ ధరతో ఎలాంటి పరికరాలు అందజేస్తున్నారు?

జ: సత్యసాయి జిల్లాలో 14 వేల హెక్టార్లలో డ్రిప్పులు , స్ప్రింకర్లు రైతులకు అందజేశాం. ఎస్సీ, ఎస్టీ రైతులకు కేవలం జీఎస్టీ చెల్లించి నూరు శాతం సబ్సిడీ తో పరికరాలను అందజేశాం. అదేవిధంగా 10 నుండి 12 ఎకరాలు లోపు ఉన్న వారికి 50 శాతం సబ్సిడీతో అందిస్తున్నాం. స్పింక్లర్లు రెండు రకాలుగా 30 పైపులు ఉన్న స్ప్రింక్లర్లు, 50 పైపులు ఉన్న స్పింక్లర్లు ఉన్నాయి. కుటుంబంలో ఎంతమంది సభ్యులు ఉన్న రైతులు షేరింగ్ పద్ధతులు ద్వారా డ్రిప్పు పరికరాలను అందజేస్తాం. రైతుల సమ్మతితో ఐదు ఎకరాలు లోపు ఉన్న వ్యక్తి ఎక్కడున్నా డ్రిప్పు పరికరాలను పొందవచ్చు. తొలుత స్వయంగా రైతే దరఖాస్తు ఫారం నింపి అందజేస్తే పరికరాలను అందిస్తాం.

ప్ర : సత్యసాయి జిల్లాలో ఎంత మంది రైతులకు డ్రిప్పు పరికరాలను అందజేశారు?

జ: శ్రీ సత్య సాయి జిల్లా వ్యాప్తంగా 10970 మంది రైతులకు 12,044.22 హెక్టార్లలో రైతులకు డ్రిప్పు, స్పింక్లర్లు అందజేశాం. కొంతమంది రైతులను ఇటీవల బ్రోకర్ల మోసం చేస్తున్నారు. డ్రిప్, స్పింక్లర్లు అందజేస్తామని బ్రోకర్లు ఇతర కంపెనీలో పేరు చెప్పి మోసం చేస్తున్నారు. వారి మాటలు నమ్మకుండా ప్రభుత్వం సూచించిన కంపెనీ ద్వారా మాత్రమే డ్రిప్పు పరికరాలు కొనుగోలు చేసి అందుకోసం దరఖాస్తు చేసుకుని రైతు వాటా చెల్లించాలి. ప్రాథమిక దర్యాప్తు అనంతరం రైతుకు కావలసిన కంపెనీలనుండి డ్రిప్పు పరికరాలు అందజేస్తాం.

ప్ర : జిల్లాలో అనర్హులకు డ్రిప్ పరికరాలు అందజేశారన్న ఆరోపణల పై మీ అభిప్రాయం.

జ : అనర్హులకు డ్రిప్పు పరికరాలు అందజేయడానికి ఆస్కారం లేదు. రైతు తన పొలాన్ని జియో ట్యాగింగ్ చేస్తాం. ఆ సిస్టం ద్వారా అదే సర్వే నంబర్ లో ఉన్నవారికి మాత్రమే పరికరాలు అందజేస్తాం. ఎవరైనా రైతులు తమ స్పింక్లర్లు ఇతరుల పొలాల్లో వేయించినా లేక విక్రయించినా చర్యలు తీసుకుంటాం. రైతులకు అందజేసిన రేటు కంటే రెండింతలు రేటుతో పెనాల్టీ వేస్తాం. జిల్లాలో గడచిన సంవత్సర కాలంలో డ్రిప్ పరికరాలు అడిగిన ప్రతి రైతుకు అందజేస్తున్నాం. ఇంకా కొత్తగా బోర్లు ,బావులు క్రింద సాగు చేసే రైతులకు అందజేస్తాం. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలి.

జిల్లా మైక్రో ఇరిగేషన్ ప్రాజెక్టు డైరెక్టర్ బి .సుదర్శన్

హంద్రీనీవా కాలువల ద్వారా

చెరువులు నింపుతాం

ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్

ప్రజాశక్తి-కదిరి టౌన్

హంద్రీనీవా కాలువల ద్వారా కృష్ణా జలాలతో ఈ ప్రాంతంలోని చెరువులను నింపుతామని ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే ఆదివారం కదిరి రూరల్ మండలంలోని చెర్లోపల్లి రిజర్వాయర్ గేట్లు ఎత్తి ప్రధాన కాలువ ద్వారా కుప్పంకు నీరు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వైసిపి హయాంలో సాగునీటి కోసం నిధులు కేటాయించకుండా, హంద్రీనీవా కాలువ లను పూర్తి చేయకుండా అసంపూర్తిగా వదిలేశారని విమర్శించారు. కూటమి ప్రభుత్వ అధికారంలోకి వచ్చాక రూ. 2వేల కోట్లు వెచ్చించి హంద్రీనీవా కాలువ లైనింగ్ పనులు చేపట్టామన్నారు. వైసిపి అధినేత జగన్ నియోజకవర్గం పులివెందులకు సైతం నీరు తరలించామని గుర్తు చేశారు. ఇప్పటికే తలుపుల మండలానికి నీరు విడుదల చేశామని, త్వరలోనే గాండ్లపెంట మండలంలోని చెరువులు నింపుతామని తెలిపారు. పట్నం, ముఖ్యాలచెరువు, కాలసముద్రం చెరువులకు నీరిచ్చామని తెలిపారు. అమృత్ పథకం కింద కదిరి పట్టణానికి నీరు తరలించేందుకు జిందాల్ కంపెనీ కాంట్రాక్ట్ దక్కించుకుందని, త్వరలో ఆ కంపెనీ పనులు చేపట్టనుందని తెలిపారు. గాండ్లపెంట మండలానికి నీరందించడానికి డిపిఆర్ సిద్ధం చేయాలని ఇంజినీరింగ్ అధికారులకు సూచనలు చేశామని, త్వరలోనే గాండ్లపెంట మండలానికి నీరిస్తామని స్పష్టం చేశారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే పార్థసారథి, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి భైరవ ప్రసాద్, కూటమి నాయకులు, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఎపి రైతు సంఘం నాయకులు

ప్రభుత్వం రైతులను ఆదుకోవాలి

ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు

ప్రజాశక్తి-నల్లచెరువు

రాష్ట్ర ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని ఎపి రైతు సంఘం జిల్లా అధ్యక్షులు పెనుకొండ హరి, ప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్న డిమాండ్ చేశారు. స్థానిక సిపిఎం కార్యాలయంలో ఆదివారం ఎపి రైతు సంఘం నాయకులు శ్రీరాములు అధ్యక్షతన ఆ సంఘం మండల కమిటీ సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా హరి, పెద్దన్న హాజరై రైతులతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పంటలకు జింకల బెడద తీవ్రంగా ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం నుంచి రాయితీపై విత్తనాలు, ఎరువులు సకాలంలో అందకపోవడం వల్ల రైతులు ప్రయివేటు వ్యక్తుల వద్ద అప్పులు చేసి పంటలు సాగు చేస్తున్నారన్నారు. పంట చేతికందక గిట్టుబాటు ధర లేక రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. విధి లేని పరిస్థితుల్లో కొందరు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారన్నారు. రైతు సంఘం జిల్లా నాయకులు మాట్లాడుతూ ఆత్మహత్యలు చేసుకున్న రైతుల అన్ని కుటుంబాలను ఆదుకోవాలని, వ్యవసాయానికి ఉచిత విద్యుత్, సబ్సిడీ పథకాలు అమలు చేయాలని, రాయితీపై మందులు, ఎరువులు, విత్తనాలు పంపిణీ చేయాలని, అన్నదాత సుఖీభవ డబ్బులు సకాలంలో ఇచ్చేలా రైతులు కలిసికట్టుగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. అనంతరం రైతు సంఘం మండల నూతన కమిటీ ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా తిరమలకొండ శ్రీరాములు, కార్యదర్శిగా మందా వెంకటస్వామి, సభ్యులుగా బయారెడ్డి, మౌలాలి, జి,అంజనప్ప, వి.రాజమ్మ, సి.చంద్రశేఖర్, కె.శ్రీరాములు, ఎం.రామచంద్రను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సిపిఎం మండల కన్వీనర్ రామకృష్ణ, రైతు సంఘం నాయకులు, రైతులు పాల్గొన్నారు.

'గుండుమల'తో వెస్టాస్ కంపెనీ ప్రతినిధుల భేటీ

ప్రజాశక్తి-మడకశిర

నియోజకవర్గంలో గాలి మరల ఏర్పాటుకు కృషి చేయాలని టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వెస్టాస్ కంపెనీ ప్రతినిధులను కోరారు. వెస్టాస్ కంపెనీ నియోజక వర్గంలో గాలిమరలు ఏర్పాటు చేస్తే ఎంతోమంది నిరుద్యోగులకు ఉద్యోగావకాశాలు దక్కుతాయని తెలిపారు. వెస్టాస్ కంపెనీ ప్రతినిధులు ఆదివారం పట్టణంలో గుండుమల తిప్పేస్వామిని కలిసి గాలి మరల నమూనా అందజేశారు. గుండుమల మాట్లాడుతూ ఇప్పటికే కడప, బద్వేల్, కర్నాటకలోని చిత్రదుర్గ, కొప్పల్, తదితర ప్రాంతాల్లో వెస్టాస్ కంపెనీ గాలి మరలు ఏర్పాటు చేసిందని, మడకశిర నియోజకవర్గంలో కూడా గాలి మరలు ఏర్పాటు చేయాలని ప్రతినిధులను కోరారు. వెస్టాస్ కంపెనీ ప్రతినిధులు మాట్లాడుతూ ఈ విషయంపై ఉన్నతాధికారులతో మాట్లాడి తెలియజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో వెస్టాస్ కంపెనీ మేనేజర్ డి.మంజునాథ్, డిఎం హయాన్స్, హరికృష్ణ, గురులింగ, లింగయాదవ్, తదితరులు పాల్గొన్నారు.

బకాయి డిఎలు ఇవ్వాలని మంత్రికి వినతి

ధర్మవరం రూరల్ : రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు తక్షణమే బకాయి డిఎలు ఇవ్వాలని కోరుతూ ఆదివారం పట్టణంలోని మంత్రి కార్యాలయంలో ఎపియుఎస్ జిల్లా గౌరవ సలహాదారు అన్నం అరవింద్ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌కు వినతి పత్రం ఇచ్చారు. అరవింద్ మాట్లాడుతూ ప్రస్తుతం ఉద్యోగులకు 4 డిఎలు పెండింగ్‌లో ఉన్నాయని, కూటమి ప్రభుత్వం ఏర్పడి 15 నెలలు కావస్తున్నా కనీసం ఒక డిఎ కూడా ఇవ్వలేకపోవడం బాధాకరమన్నారు. డిఎలు ఇవ్వని పక్షంలో సమ్మెకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. స్పందించిన మంత్రి ఈ విషయాన్ని విద్యాశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా చూస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఉద్యోగులు అశోక్, వాసు, దారాలప్ప, రాజు, తదితరులు పాల్గొన్నారు.

రహదారుల్లో నీటి నిల్వలు తొలగింపు

పుట్టపర్తి క్రైమ్ : పట్టణంలో నీటి నిల్వలు ఉన్న ప్రాంతాల్లో గత శనివారం సిపిఎం జిల్లా కార్యదర్శి రామకృష్ణ, సిఐటియు నాయకులు అంజి, పైపల్లి గంగాధర్ పర్యటించి వెంటనే పారిశుధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్ చేయడంతో అధికారులు స్పందించారు. ఇందులో భాగంగా ఆదివారం వారపు సంత, కర్నాటక నాగేపల్లి వంతెన సమీపంలో మడుగులను తలపిస్తున్న నీటి నిల్వలను జెసిబితో తొలగించారు.

చిలమత్తూరు పెద్దచెరువులో మట్టి తవ్వుతున్న జెసిబి

ప్రయివేటు వెంచర్‌కు మట్టిని తరలిస్తున్న ట్రాక్టర్

చెరువులో అక్రమంగా మట్టి తవ్వకాలు..!

పట్టించుకోని ఇరిగేషన్ అధికారులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రమైన చిలమత్తూరుకు సమీపంలోని పెద్ద చెరువులో మట్టి యథేచ్ఛగా తరలి పోతోంది. అడ్డుకోవాల్సిన అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ఈ మట్టి దందా కొందరు అధికార పార్టీ నాయకుల కనుసన్నల్లోనే నడుస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. పెద్ద చెరువులో జెసిబి ఏర్పాటు చేసి మట్టిని తవ్వి ట్రాక్టర్లలో నింపి తరలిస్తున్నారు. గత నాలుగు రోజులుగా 10 నుంచి 15 ట్రాక్టర్లతో వందల లోడ్ల మట్టిని ప్రయివేటు వెంచర్లకు రవాణా చేస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. మట్టి లోడుతో ట్రాక్టర్లు చిలమత్తూరులోని ప్రధాన రహదారి మీదుగా ఇష్టారాజ్యం గా రయ్.. రయ్‌మంటూ వెళ్తున్నా అధికారు పట్టించుకోకపోవడం పలు అనుమానాలు, ఆరోపణలకు తావిస్తోంది. టిడిపికి చెందిన కొందరు నాయకులు మట్టిని అక్రమ రవాణా చేసి రూ. లక్షలు గడిస్తున్నట్లు సర్వత్రా చర్చ నడుస్తోంది. ఈ రహదారి నిత్యం రద్దీగా ఉండడంతో వాహనాలు అతివేగంగా మట్టిని తీసుకెళ్తున్న సమయంలో ఏమైనా ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలించడంతో ప్రభుత్వ ఆదాయానికి లక్షల్లో గండి పడుతుంది. ప్రభుత్వానికి సంబంధించిన ముఖ్యమైన ఆదాయ వనరు అయినప్పటికీ యథేచ్ఛగా అక్రమంగా మట్టి తవ్వుకుంటున్నారు. ఒక్కరోజే వంద ట్రాక్టర్ల వరకూ తరలించినట్లు తెలుస్తోంది. ఇకనైనా అధికారులు మేల్కొని వీరి ఆగడాలకు అడ్డుకట్ట వేయాలని స్థానిక ప్రజలు కోరుతున్నారు. సహజ వనరులను కాపాడి, ప్రకృతి, రైతులకు నష్టం జరగకుండా అధికారులు చర్యలు చేపట్టాలని గ్రామస్తులు, ప్రజలు, రైతులు, పర్యావరణ ప్రేమికులు కోరుతున్నారు.

జిల్లా కేంద్రం మార్పు ప్రచారంపై అన్ని పార్టీలు స్పందించాలి

ఎఐసిసి సభ్యులు కోటా సత్యనారాయణ

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీసత్యసాయి జిల్లా కేంద్రం మార్పు విషయమై వివిధ రకాల ప్రచారాలు, వదంతులు వినిపిస్తు న్నాయని, వీటిపై అన్ని రాజకీయ పార్టీల నాయకులు స్పందించాలని పుడా మాజీ చైర్మన్, అఖిల భారత కాంగ్రెస్ పార్టీ కమిటీ సభ్యులు కోటా సత్యనారాయణ పిలుపునిచ్చారు. పట్టణంలోని తన నివాసంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ శ్రీసత్యసాయిబాబా వల్ల పుట్టపర్తి ప్రపంచ ప్రసిద్ధిగాంచిందన్నారు. బాబా సోదరులు ఆర్‌వి.జానకిరామయ్య ఎన్నో ఏళ్లుగా జిల్లా కోసం పోరాడారన్నారు. ఈ ప్రాంత ప్రజల కోరిక మేరకు మూడేళ్ల క్రితం గత వైసిపి ప్రభుత్వం జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేసిందన్నారు. ఇక్కడ అన్ని మౌలిక సదుపాయాలు ఉన్నాయన్నారు. అన్ని పట్టణ నగరాలకు బస్సు సౌకర్యం, రైల్వే, విమానాశ్రయం, నీరు, భూ వనరులతో పాటు అన్ని నియోజకవర్గాలకు అందుబాటులో మధ్యలో ఉందన్నారు. అలాంటిది హిందూపురం కేంద్రంగా ఎమ్మెల్యే బాలకృష్ణ జిల్లా ఏర్పాటుకు ప్రయత్నిస్తున్నారనే ప్రచారం జరుగుతోందన్నారు. బాలయ్య ఈ ప్రాంత ప్రజల ఆశయాలు, కోట్లాది మంది మనోభావాలను దెబ్బతీసేలా ప్రవర్తించరాదన్నారు. జిల్లా కేంద్రం మార్పుపై సిఎం చంద్రబాబు తొందరపాటు నిర్ణయం తీసుకోరనే నమ్మకం ఉందన్నారు. అన్ని పార్టీల నాయకులు అఖిలపక్షంగా ఓ కమిటీ వేసి ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు.

మాట్లాడుతున్న కోటా సత్యనారాయణ

అర్హులందరికీ సిఎం సహాయ నిధి : మంత్రి సవిత

ప్రజాశక్తి-పెనుకొండ

అనారోగ్యం బారిన పడి ప్రయివేటు ఆసుపత్రుల్లో చికిత్స పొందిన పేదలకు సిఎం సహాయ నిధి ఓ వరమని, ఈ పథకం ద్వారా కార్పొరేట్ వైద్యం పొందవచ్చని మంత్రి సవిత తెలిపారు. నియోజకవర్గంలోని 34 మంది లబ్ధిదారులకు సిఎం సహాయ నిధి ద్వారా మంజూరైన రూ. 19, 52,195 విలువ చేసే చెక్కులను ఆదివారం మంత్రి పట్టణంలోని తన క్యాంపు కార్యాలయంలో అందజేశారు. మంత్రి మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా కేవలం అర్హతే ఆధారం గా సిఎం రిలీఫ్ ఫండ్ నిధులు అందిస్తున్నామన్నారు. ఇప్పటికే నియోజక వర్గంలో రూ. 3 కోట్లకు పైగా నిరుపేదలకు సిఎం రిలీఫ్ ఫండ్ అందించామ న్నారు.

మంత్రి సవితకు వినతి ఇస్తున్న సోమందేపల్లి పద్మశాలీయులు

మంత్రికి పద్మశాలీయుల వినతి

సోమందేపల్లి : పద్మశాలీయుల అభ్యున్నతికి తోడ్పాటు అందించాలని కోరుతూ ఆదివారం పద్మశాలీయులు మంత్రి సవితను ఆమె క్యాంపు కార్యాలయంలో కలిసి విన్నవించారు. ఆ సంఘం అధ్యక్షుడు జక్కా చంద్ర మాట్లాడుతూ సోమందేపల్లిలో పద్మశాలీయులు తరతరాలుగా చేనేత వృత్తిని నమ్ముకుని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. ప్రస్తుతం ఆయా కుటుంబాలకు పోషణ కష్టంగా ఉందన్నారు. కావున వారికి అవసరమైన చేయూత అందించాలని, పద్మశాలీయుల ఆర్థిక, రాజకీయ, విద్యాభివృద్ధికి తోడ్పాటు అందించాలని కోరారు. కార్యక్రమంలో ఆ సంఘం ఉపాధ్యక్షుడు బడిమెల అశోక్, ఆకుల రమణ, జింకా గంగాధర్, జింకా మురళి, రాజు, మహేష్, అనిల్, హేమంత్, వేమనారాయణ, హరి, ఆది, సోము, కుమార్, రవి, జింకా చంద్ర పాల్గొన్నారు.

విఆర్‌ఎల సంఘం నూతన కమిటీ ఎన్నిక

బత్తలపల్లి : గ్రామ రెవెన్యూ అసిస్టెంట్ల(విఆర్‌ఎ) మండల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముందుగా మండలంలోని వివిధ గ్రామాల విఆర్‌ఎలందరూ స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో సమావేశమయ్యారు. వారు గ్రామస్థాయిలో, రెవెన్యూ కార్యాలయంలో ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. అనంతరం మండల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షునిగా మందల నరసింహులు, ప్రధాన కార్యదర్శిగా మాల్యవంతం రామ్‌ప్రసాద్, ఉపాధ్యక్షునిగా మాతంగి రాజా, కార్యదర్శిగా నారాయణస్వామి, సభ్యులను ఎన్నుకున్నారు.

పిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల కమిటీ..

బత్తలపల్లి : ధర్మవరం తాలూకా పంచాయతీరాజ్ మినిస్టీరియల్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తామని నూతన అధ్యక్షుడిగా ఎంపికైన అక్కిం ప్రతాప్ పేర్కొన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయ సమావేశ మందిరంలో ఆదివారం ఎపి పిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల సంఘం ధర్మవరం తాలూకా యూనిట్‌కు ఎన్నికలు నిర్వహించారు. అధ్యక్షునిగా ఎ.ప్రతాప్, వైస్ ప్రెసిడెంట్‌గా బి.కరుణశ్రీ, జనరల్ సెక్రటరీగా సుబ్రహ్మణ్యం, జాయింట్ సెక్రటరీగా డి.శ్రీనివాసులు, ట్రెజరర్‌గా సి.సుదర్శన్‌రెడ్డి, సభ్యులుగా ఎం.అబ్దుల్‌నబి, ఎం.గోపాలకృష్ణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గం సభ్యులు మాట్లాడుతూ తమను ఏకగ్రీవంగా ఎన్నుకున్నందుకు సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నికల అధికారులుగా ఆర్.విజయశేఖర్‌నాయుడు, లెక్కల శ్రీనివాసులు వ్యవహరించారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, మల్లికార్జున, విజయభాస్కర్‌రెడ్డి, రామ్‌కిషోర్, ఎస్.హరిబాబు, ఎస్.అల్లాబకాష్, టి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన పిఆర్ మినిస్టీరియల్ ఉద్యోగుల కమిటీ

'సంస్కృతి' ట్రస్ట్ సేవలు అభినందనీయం

ధర్మవరం రూరల్ : సంస్కృతి సేవా సమితి ట్రస్ట్ సేవలు అభినందనీయమని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ కొనియాడారు. మంత్రి ఆదివారం పట్టణంలో జరిగిన పలు కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మంత్రి మాట్లాడుతూ సంస్కృతి సేవా సమితి ట్రస్ట్ రోగులకు శస్త్రచికిత్స ఖర్చులు సహా అన్ని వైద్య సదుపాయాలను భరిస్తుందన్నారు. సేవ చేయడం ద్వారానే మనిషి జీవితానికి సార్థకత చేకూరుతుందన్నారు. అవసరమైన వారికి చేయూత అందించడం సామాజిక బాధ్యత అన్నారు. ఈ ప్రయత్నం ద్వారా అనేక కుటుంబాలు కొత్త ఆశతో, ఆరోగ్యకరమైన జీవితం వైపు అడుగులు వేస్తాయని మంత్రి ఆశాభావం వ్యక్తం చేశారు. మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్న 25 మందిని ప్రత్యేక బస్సు ద్వారా బెంగళూరులోని వైదేహి ఆసుపత్రికి తరలించేందుకు ఏర్పాట్లు చేశారు. కార్యక్రమంలో నాయ కులు శేఖర్, డోలా రాజారెడ్డి, జింకా చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ఏర్పాటుపై పావగడ ఎమ్మెల్యేకు విజ్ఞప్తి

రొద్దం : కర్నాటక సరిహద్దులోని కొడమడుగు గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్చ్ ప్రారంభో త్సవ కార్యక్రమానికి ఆదివారం కర్నాటకలోని పావగడ ఎమ్మెల్యే వెంకటేష్ ముఖ్యఅతిథిగా హాజర య్యారు. ఈ విషయం తెలిసి మండలంలోని తాడంగిపల్లి గ్రామస్తులు అక్కడికి వెళ్లి ఎమ్మెల్యే వెంకటేష్ ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారు కొడమడుగు వద్ద నుంచి తాడంగిపల్లి సరిహద్దు వరకూ రోడ్డు ఏర్పాటు విషయంపై చర్చించారు. మా గ్రామానికి రోడ్డు ఎక్కువ భాగం కర్నాటక ఆధీనంలో ఉందని, కావున కర్నాటక ప్రభుత్వంతో మాట్లాడి రోడ్డు ఏర్పాటు చేయించాలని కోరారు. స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇదే విషయాన్ని ఇటీవల మంత్రి సవిత తన దృష్టికి తెచ్చారని, మరో రెండు నెలల్లో మీ గ్రామానికి రోడ్డు ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు.

వైసిపి ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ-మోసం గ్యారెంటీ'

మడకశిర : వైసిపి నియోజకవర్గ సమన్వయకర్త ఈరలక్కప్ప, ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వైసి.గోవర్ధన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం మండలంలోని వైబి.హళ్లి పంచాయతీలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి, రూరల్ అబ్జర్వర్ మధుమతిరెడ్డి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్, ఎన్నికల హామీలను అమలు చేయకుండా ప్రజలను మోసం చేస్తుందన్నారు. కేవలం ప్రజలను మభ్యపెట్టడానికి బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమం చేపట్టిందని దుయ్యపట్టారు. అలాగే వైసిపి రూపొందించిన క్యూఆర్ కోడ్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిపి కవితా సత్యనారాయణ, సర్పంచులు మూర్తి, రంగనాథ్, నాయకులు రంగేగౌడ్, సత్యనారాయణ, శేషాద్రి, నరసింహ, మల్లికార్జునగౌడ్, జయప్రదమ్మ, హనుమంతు, గోపి, నాగేష్ పాల్గొన్నారు.

యుటిఎఫ్ క్రికెట్ టోర్నీలో ఫైనల్స్‌కు చేరిన రొద్దం జట్టు

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

యుటిఎఫ్ సీనియర్ నాయకులు జి.రామాంజనేయులు జ్ఞాపకార్థం పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో టోర్నమెంట్ కన్వీనర్ జిసి.నరేష్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జిల్లా స్థాయి టీచర్స్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ దశకు చేరింది. ఈ క్రమంలో ఆదివారం జరిగిన తొలి సెమీ ఫైనల్ మ్యాచ్‌లో రొద్దం సూపర్ కింగ్స్, చిలమత్తూరు జట్లు తలపడ్డాయి. మొదట చిలమత్తూరు జట్టు 14 ఓవర్లలో 101 పరుగులు చేయగా రొద్దం జట్టు 11 ఓవర్లలో 2 వికెట్స్ కోల్పోయి విజయం సాధించింది. 56 పరుగులతో నాటౌట్ గా నిలిచిన రొద్దం జట్టు కెప్టెన్ నరేష్ కుమార్‌కు ముఖ్య అతిథులుగా హాజరైన ఉపాధ్యాయులు గంగాధర్‌రెడ్డి, శ్రీనివాసులు మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ బహుమతి అందజేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ డివిజన్ నాయకులు గంగాధర్, ఆది జినేష్ జైన్, శివయ్య, శ్రీనివాసులు, కాశీ, విష్ణు, జగదీశ్, రామాంజనేయులు, అశోక్, పాల్గొన్నారు.

పల్లె ఉమ సేవలు మరువలేనివి

జయంతి సభలో టిడిపి నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి సతీమణి పల్లె ఉమ సేవలు మరువలేనివని టిడిపి నాయకులు కొనియాడారు. పల్లె ఉమ జయంతి సందర్భంగా ఆదివారం పట్టణంలోని టిడిపి కార్యాల యంలో నాయకులు ఆమె విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి పలువురికి పంచిపెట్టారు. నాయకులు మాట్లాడుతూ పల్లె ఉమ నియోజకవర్గ వ్యాప్తంగా టిడిపికి, కార్యకర్తలకు ఎనలేని సేవలు అందించారన్నారు. మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి కుడి భుజంగా ఉంటూ ఆయన విజయానికి ఎంతో కృషి చేశారన్నారు. పలు సేవా కార్యక్రమాలు చేపట్టి ప్రజల ఆదరభిమానాలు పొందారన్నారు. బాలాజీ విద్యాసంస్థల ద్వారా ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యనందించారన్నారు. ఆమె లేని లోటు తీర్చలేనిదన్నారు. కార్యక్రమంలో సింగల్ బిందు అధ్యక్షుడు విజయ్ కుమార్, నాయకులు బొమ్మయ్య, పుల్లప్ప, మనోహర్, ఈశ్వర్ రెడ్డి, వెంకటేశు, అంబులెన్స్ రమేష్, మహిళా సంఘాల ప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

కొత్తచెరువు : టిడిపి ఆధ్వర్యంలో స్థానిక బుక్కపట్నం రోడ్డులో ఉన్న ఎన్టీఆర్ విగ్రహం వద్ద పల్లె ఉమ చిత్రపటాన్ని ఉంచి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. నాయకులు మాట్లాడుతూ ఆమె పేదలు, టిడిపి నాయకులు, కార్యకర్తలు, నియోజకవర్గ అభివృద్ధికి చేసిన కృషి స్ఫూర్తిదాయకమని తెలిపారు. కార్యక్రమంలో టిడిపి మండల, టౌన్ కన్వీనర్లు రామ కృష్ణ, వలిపి శ్రీనివాసులు, మార్కెట్ యార్డ్ ఛైర్మన్ పూల శివప్రసాద్, నాయకులు ఎస్.శ్రీనివాసులు, పివి.శివప్రసాద్, కాంట్రాక్టర్ లక్ష్మీనారాయణ, వెంగప్ప, నాగేంద్ర, నాగేంద్రప్రసాద్, నల్లమాడ శంకర్, బండ్లపల్లి రాజప్ప, బండ్లపల్లి కిష్టప్ప, భాస్కర్, సైకిల్ షాప్ బాబా, కేశప్ప పాల్గొన్నారు. .

పెనుకొండలోని శ్రీసత్యసాయి కళాశాలలో పల్లె ఉమకు నివాళులర్పిస్తున్న ప్రిన్సిపల్, సిబ్బంది

పెనుకొండ టౌన్ : పట్టణంలోని శ్రీసత్యసాయి కళాశాలలో పల్లె ఉమ 65వ జయంతి వేడుకలు నిర్వహించారు. డిగ్రీ కళాశాలలో ప్రిన్సిపల్ డాక్టర్ ఆదిశేషారెడ్డి, కళాశాల ఏవో కేశవయ్య పల్లె ఉమ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పంచి పెట్టారు. వారు మాట్లాడుతూ పల్లె ఉమ ఎంతో మంది పేద విద్యార్థులకు ఉచితంగా విద్యాదానం చేసి వారి బంగారు భవిష్యత్తుకు బాటలు వేశారని కొనియాడారు. అనంతరం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు బ్రెడ్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

బుక్కపట్నం : పల్లె ఉమ జయంతి సందర్భంగా టిడిపి ఆధ్వర్యంలో స్థానిక తేరువీధిలో కేక్ కట్ చేశారు. అలాగే స్థానిక పిహెచ్‌సిలో రోగులకు పాలు, బ్రెడ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో టిడిపి జిల్లా కార్యదర్శి సామకోటి ఆదినారాయణ, టౌన్ కన్వీనర్ కేశప్ప, నాయకులు గంగాధర్, మాజీ సర్పంచి సాకే యశోద, బాలు, వెంకటరాముడు, సయ్యద్ బాషా, మంజు, సుధీర్, లావణ్యగౌడ్, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-చిలమత్తూరు

మండలంలోని యగ్నిశెట్టిపల్లి సమీపంలోని ఓ కోళ్ల ఫారంలో వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం రాత్రి చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. జార్ఖండ్‌కు చెందిన ఆనంద్ సర్దార్ ఓ కోళ్ల ఫారంలో కూలికి పనిచేస్తూ జీవనం సాగించేవాడు. భార్యతో చోటుచేసుకున్న కుటుంబ కలహాల నేపథ్యంలో కోళ్ల ఫారంలోనే ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అదే ఫారంలో డ్రైవర్‌గా పని చేసే వ్యక్తి గమనించి సమాచారం ఇవ్వడంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించి హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మృతి

ప్రజాశక్తి-గాండ్లపెంట

గాండ్లపెంటకు చెందిన వైసిపి నాయకుడు, మార్కెట్ యార్డ్ మాజీ డైరెక్టర్ మహమ్మద్ ఫారుక్(52) గుండెపోటుతో మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.. వివరాలు.. ఫారుక్ శనివారం రాత్రి నిద్రిస్తుండగా ఆదివారం వేకువజామున ఛాతిలో నొప్పి రావడంతో కుటుంబ సభ్యులు వెంటనే వాహనంలో కదిరి ఆసుపత్రికి తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. అతడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. విషయం తెలిసిన వెంటనే వైసిపి మండల కన్వీనర్ జి.రవీంద్రారెడ్డి, నాయకులు కృష్ణారెడ్డి, మహమ్మద్ ఇక్బాల్ ఫారుక్ మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఫారుక్(ఫైల్‌ఫొటో)

విద్యుత్ వైర్ల దొంగల ముఠా అరెస్ట్

రూ. 6.5లక్షల విలువచేసే వైర్లు, కట్టర్లు, ఆటో స్వాధీనం

ప్రజాశక్తి-సోమందేపల్లి

మండలంలో విద్యుత్ వైర్ల చోరీకి పాల్పడుతున్న దొంగల ముఠాను అరెస్టు చేసినట్లు పెనుకొండ డీఎస్పీ నరసింగప్ప తెలిపారు. ఆయన ఆదివారం ఎస్‌ఐ రమేష్‌బాబుతో కలిసి స్థానిక పోలీస్ స్టేషన్‌లో పాత్రికేయుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. డీఎస్పీ మాట్లాడుతూ కొందరు వ్యక్తులు ముఠాగా ఏర్పడి ఎక్కడికక్కడ విద్యుత్ వైర్లను కత్తిరించి వాటిని తీసుకెళ్లి విక్రయించి సొమ్ము చేసుకునేవారన్నారు. ఈ సమాచారం రావడంతో సోమందేపల్లి మండలానికి చెందిన అభిలాష్, పటాన్ షబ్బీర్, సయ్యద్ జామీర్, జిలాన్‌ఖాన్, భక్తర్ అనే వ్యక్తులను విచారించగా సోమందేపల్లి మండలంలో 40 స్తంభాలకు సంబంధించిన 800కిలోలు, రొద్దం మండలంలో 800, పెనుకొండ మండలంలో 1500కిలోల వైర్లను చోరీ చేసినట్లు తెలిసిందన్నారు. వారి నుంచి సుమారు రూ. 6.5లక్షల విలువచేసే వైర్లు, కట్టర్లు, చోరీలకు ఉపయోగించిన ఆటోను సీజ్ చేసి, వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

స్వాధీనం చేసుకున్న వైర్లు, ఆటోను చూపుతున్న డీఎస్పీ, ఎస్ఐ

వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్‌కు నియామక పత్రం అందజేత

ప్రజాశక్తి-మడకశిర

కూటమి ప్రభుత్వం ఇటీవల రాష్ట్ర కుంచితి ఒక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మడకశిర పట్టణానికి చెందిన లక్ష్మీనారాయణను నియమించిన విషయం తెలిసిందే. అందుకు సంబంధించిన జీవో పత్రాన్ని ఆదివారం పట్టణంలో మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి, టిడిపి రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి లక్ష్మీనారాయణకు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. మడకశిర నియోజకవర్గంలో కుంచితి వక్కలిగ సామాజిక వర్గం ప్రజలు అధికంగా ఉన్నారు. ఈ నేపథ్యంలో కార్పొరేషన్ ఛైర్మన్‌గా లక్ష్మీనారాయణకు అవకాశమిచ్చారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకుడు పుట్ట కామప్ప, టిడిపి మండల కన్వీనర్ నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేషన్ ఛైర్మన్‌కు యుటిఎఫ్ సన్మానం

వక్కలిగ కార్పొరేషన్ ఛైర్మన్ లక్ష్మీనారాయణను మండల యుటిఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలింగప్ప, జోగప్ప ఆధ్వర్యంలో పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, జిల్లా కార్యదర్శి నరసింహప్ప మాట్లాడుతూ టిడిపికి విశిష్ట సేవలందించిన లక్ష్మీనారాయణకు సిఎం చంద్రబాబు ఈ అవకాశం కల్పించడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో గుండుమల చంద్రప్ప, యుటిఎఫ్ నాయకులు మూడ్ల గిరియప్ప, నరసింహమూర్తి, మహంతేష్, దేవరాజు, ఈరన్న, నరసింహరాజు, శివన్న, రంగనాథ్ పాల్గొన్నారు.

జిల్లా పిఇటిల నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కొత్తచెరువు

కొత్తచెరువులో ఆదివారం నిర్వహించిన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా సర్వ సభ్య సమావేశానికి రాష్ట్ర నాయకులు జోసెఫ్, లక్ష్మయ్య, శ్రీకాంత్‌రెడ్డి, సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరై నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా అంజన్న, ప్రధాన కార్యదర్శిగా రామకృష్ణ, ట్రెజరర్‌గా రవీందర్ నాయక్‌ను నియమించారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ జిల్లాలో పిఇటిల అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మాజీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు శివకుమార్, వెంకటేష్, మాజీ ట్రెజరర్ రామకృష్ణ, మురారి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన అంజన్న, రామకృష్ణ

కంచిసముద్రంలో రోడ్డుపై మురుగు

ప్రజాశక్తి-లేపాక్షి

మండలంలోని కంచిసముద్రం గ్రామంలో డ్రెయినేజీ వ్యవస్థ సరిగా లేకపోవడంతో మురుగు నీరు రోడ్డుపైకి చేరి మడుగులను తలపిస్తున్నాయి. ప్రధానంగా బస్టాండ్ వద్ద ఉన్న సర్కిల్‌లో పెద్దఎత్తున మురుగు, వర్షం నీరు నిలిచింది. ఈ మార్గంలో నిత్యం గ్రామస్తులు, ప్రయాణికులు, విద్యార్థులు రాకపోకలు సాగిస్తుంటారు. దీనికి తోడు బస్సు కోసం ఇక్కడే వేచి ఉంటారు. అయితే మురుగునీరు నిల్వ ఉండడంతో దుర్వాసన భరించలేకపోతున్నారు. అలాగే దోమలు వృద్ధి చెందడంతో స్థానికులు రాత్రివేళ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ విషయంపై సిపిఎం మండల కన్వీనింగ్ కార్యదర్శి కృష్ణమూర్తి మాట్లాడుతూ డ్రెయినేజీ నీరు రోడ్డుపై నిల్వ ఉండటంతో భరించలేని దుర్వాసన వెదజల్లుతోందన్నారు. గ్రామంలో డ్రెయినేజీ కాలువ నిర్మాణం పనులు చేపట్టి చాలా రోజులైనా నేటికీ పూర్తి చేయడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఈ విషయంపై పంచాయతీ అధికారులు మాట్లాడుతూ డ్రెయినేజీ కాలువ నిర్మాణం పనులు జరుగుతున్నందున ఇలాంటి సమస్య తలెత్తుతుం దని, వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని తెలిపారు.

కంచిసముద్రంలో బస్టాండ్ వద్ద రోడ్డుపై నిలిచిన మురుగు నీరు